# పుట్టినరోజు పండగ

శ్రీ ఇవటూరి సాంబశివరావు

ఇవాళ బుధవారం. ఆవాళే నాపుట్టినరోజు పండగ. "జాము న్నర ప్రొద్దెక్కింది, లేవరా! ఇంకా పడుకోవడ మేమిటీ? ఆనిద్రకు అంతేలేదా ఏం?...అయ్...అయ్ అయ్...అయ్యో! ఇంకా తలకి నీళ్లు పోసుకోవడం ఎప్పుడూ? తెమలడం ఎప్పుడూ! కాకపోయినా—నీకు చదువూ సంధ్యా ఏమిల్లే!? ఒకటే చదువు" నేనింకా నిద్ర మంచం మీద నుంచి లేవకుముందే మా అమ్మ మొదలు పెట్టింది.

ఇక లేవకపోతే ఎలాగా భాగోతము జరుగక తప్పదనుకుంటూ విధిలేక లేచి పెరట్లోకి వెళ్ళాను, మొఖం కడుక్కుందామని.

"ఒరే అబ్బాయీ! లేచావా? ఇంకా మొఖం కడుక్కోవడం అయినా కాలేదే!... అక్కడ నీళ్లు సలసల కాగుతున్నాయ్, నూనె రాసుకు తొందరగా తెములు తావా తలంటి పోసుకొందువు గాని" అంటూ మళ్ళీ మొదలెట్టింది మా అమ్మ.

మొఖం కడుక్కున్నాను. ఆపొయ్యి దగ్గర నిలబడి ఏదో ఆలోచిస్తున్నాను. వెనక నుంచి మామామ్మ పిడక ముక్క పట్టుకు వస్తూవుండటం కనుపించింది.

"అయ్యో బాబోయ్! ఇవ్వాళ పొద్దున్నే అవుతోందిరోయ్ పెళ్ళి" అంటూ పారిపోబోయాను.

అదృష్టవశత్తూ మా మామ్మ ఆపేడు ముక్కను పొయ్యిలో పడేసి నా దగ్గరికి వచ్చింది. "ఏరా! బెంకంత ఉన్నావో లేదో, నీకు పెళ్ళి కావలిసి వొచ్చిందా? నిన్ను నూని రాసుకు తగులడమంటే, పరుగులు తీస్తావేం? ఊ...చూస్తావే ఆనూని రాసుకు మరీ ఏడు" అంటూ మామామ్మ మేలుకొలుపు మొదలెట్టే సరికి నేను నృత్యం చేయడం ప్రారంభించాను. ఆ సమయంలోనే నేను ఆనూనె గిన్నెను తన్నెయ్యడం జరిగింది.

మాఅమ్మ కూడా ఆ సమయానికే నాముందర ప్రత్యక్ష మయింది. "ఏవిట్రా! ఎందుకూ? ప్రొద్దున్నే ఏడుస్తున్నావుట. ఇంక నీ మొఖానికి పుట్టిన రోజూ...పండగా... ఏమీ లేదా ఏవిటి?" ఈమాటలు అనే సరికి ఆ నూనిగిన్నె ఆవిడ కళ్ళబడింది కాబోలు-"అయ్యో! ఇదే విట్రా! నిన్ను నూని రాసుకు కూచోమంటే నూనెగిన్ని తన్నేసి ఇంకా ఏమీ తెలియనట్టు ఏడుస్తున్నావా! ఏడు నీఖర్మ, ఖర్మను తప్పించే వాడెవడు లే! అయినా నీకు 'అమ్మ పెట్టేవి రెండూ పెడితేనే కాని బుద్ధిరాదు లే!" అంటూ వేదాంతంలోకి దిగి పొద్దున్నే నా వీపుమీద రెండు తగిలించి ఇంట్లోకి వెళ్ళిపోయింది. చివరికి ఎలాగయితే నేం ఆ రోజు వెయ్యి దేవుళ్లకి మొక్కుకొంటూ తలంటి పోసుకొన్నాను.

మా నాన్నగారికి నిద్ర మంచం మీదనుంచి లేవడం తడవుగా ఆయన నోట్లో 'వెధవ' అన్నమాట రెడీగా ఉంటుంది. నన్ను చూసీ చూడగానే "ఏరా! వెధవ, తెల్లారగట్లే లేవడం, చదువుకోడం ఏమీ లేదా ఏం? పరీక్షలు దగ్గరి కొస్తున్నాయ్ కదా! అంతేలే నీకు చదువేమిటి? అదేం? వెధవ్వి అలా ఏడుస్తున్నావ్— ఎందుకు? ఏం జరిగింది?" అంటూ యధారీత్యా అక్షతలు జల్లడం ప్రారంభించారు.

మాఅమ్మ అంతట్లోకే వచ్చి "అదేవిటండి పొద్దున్నే ఎందుకు వాడినలా తిడతారు? వాడి పుట్టిన రోజు కదా ఈవేళ" అంది—అక్కడికి తనేమో నన్ను ఎత్తుకు ముద్దాడినట్టు!

"'ఆఁ...! ఇవాళేనేవిటి యీ వెధవ పుట్టింరోజు? పాడ్యమికదూ? అవును...ఈవేళే." అంటూ మా నాన్నగారు పెరట్లో కెళ్ళారు.

ఇంక స్కూలు కెడదాం అనుకుంటూ టైంటేబుల్ చూసుకొనే సరికి మొదటి పిరుడు ఇంగ్లీషు ఉన్నట్టు కన్పించింది. మా ఇంగ్లీషు మాష్టారంటే అందరికీ హడలే. ఒక్కసారి ఆయన గట్టిగా అరచా



## ★ పుట్టినరోజు పండగ ★

డంటే క్లాసులో అందరూ గజగజ వణికి పోవాలసిందే! అది కాకుండా ఆయన ఇవాళే నోట్సు చూస్తానని నిన్న క్లాసులో అన్నమాట జ్ఞాపకం వచ్చేసరికి ఒక్కసారి నిలువునా నీరైపోయాను"

నరే-అయేదెలాగ అవకతప్పదనుకుంటూ భోంచేసి స్కూలుకి బయలుదేరాను. కాని స్కూలుకి వెళ్ళుతూంటే, నిజంగా సింహానికి ఆహారంగా వెళ్లుతున్న కుందేలు ఏమనస్సులా వుంటుందో, నా మనస్సులోనూ అలాగే వుంది. తీరా క్లాసులోకి వెళ్ళి కూచునేసరికి 'సోషల్ స్టడీస్ మేష్టారు' మా క్లాసులోకి వచ్చారు. అది చూసి "మాకు మీరు కాదండీ, మేష్టారు ఇప్పుడు. మాకిప్పుడు ఇంగ్లీషండీ. లాస్టుపిరుడండీ మీరు" అని గట్టిగా అరిచాను. (మేష్టారు మర్చిపోయి వస్తున్నారన్న ఉద్దేశంతో)

కాని ఆయన నా మాట వినిపించుకోకుండా క్లాసులోకి వచ్చి కుర్చీలో కూచుంటూ "ఎవడ్రా ఆవెధవ? స్టాండ్ అప్" అని గద్దించాడు. కొయ్యబొమ్మలా నిలబడ్డాను.

"ఏరా! ఇవాళ నా టైంటేబుల్లో ఫస్టుపిరుడు నాకిక్కడ వర్కుందని ఉంటే, ఇంగ్లీషని వాగుతావేం? మతి ఏమైనా పోయిందా ఏమిటి? బెంచీ ఎక్కు" అని హుకుంవేసి, తన ముక్కులో యింత పొడుం దట్టించుకొన్నాడు.

అంతట్లోకే నా ఫ్రెండు మోహన్ గాడు లేచి "అది కాదండి మాష్టారూ! వాడు రేపు లక్షిం వారం టైం టేబుల్ చెపుతున్నాడండి" అని తనకన్నీ తెలిసినట్టుగా బయట పెట్టాడు.

"అవున్రా! వాడికి చదవేస్తే ఉన్నమతి పోతోంది. వారాలే జ్ఞాపకం వుండటం లేదు. లేకపోతే ఈ వెధవకి చదువేమిటి?" అని మేష్టారు అనేసరికి నాకప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఈవాళ బుధవారం అని. కాని ఏం లాభం—?

అంతట్లోకే మా మేష్టారు "పాఠాలు అందరూ బాగా చదువుకొచ్చారా? కొశ్చన్లు అడుగుతానన్నాను కదూ—?" అన్నారు.

మళ్ళీ మా మోహన్ గాడే లేచి 'మేష్టారూ? గుంటూరులో వేడి జాస్తీ అంటారు ఎందుచేతనండీ?

(43-వ పేజీ చూడండి)

బస్తీలో గస్తీలు తిరిగిన మా మేనమామ ఒకసారి మా పల్లెటూరికి వచ్చాడు. మమ్మల్నందరినీ మెప్పించాలనీ, నవ్వించాలనీ ఆయన ఏవేవో చమత్కారాలు చెప్పుకుపోవటం మొదలు పెట్టాడు. ఆయన చెప్పినవి అన్నీ చప్పగా వున్నాయి. మావాళ్లు ఎవ్వరూ నవ్వటం లేదు. నేను మాత్రం ప్రతి దానికీ పగలబడి నవ్వటం ప్రారంభించాను. నన్ను చూసి కాబోలు - మావాళ్లూ కొద్ది కొద్దిగా నవ్వటం ప్రారంభించారు.

కొంతసేపు గడిచాక మా అన్నయ్య నన్ను రహస్యంగా అడిగాడు... "ఏంరా? మామయ్య చెప్పేవన్నీ నీకు అర్థమౌతున్నాయా- అంతగా నవ్వుతున్నావ్?" అని.

"అది కాదురా? మనం ఎవరమూ నవ్వకపోతే, ఆయన చెప్పిందే చెప్పి మళ్లీ మన ప్రాణాలు తోడెయ్యగలడు. ఆ ఆపద తప్పించటానికే నేనింత యాతన పడుతున్నాను." అని నేను మా వాడి చెవిలో వూదాను.

# పుట్టినరోజు పండగ

(36-వ పేజీ తరువాయి)

అని దీర్ఘం తీసుకుంటూ వికిటంగా ఒక ప్రశ్న వేశాడు.

ఆ సమయానికే నాకు నిన్న చెప్పినటువంటి బెలూచిస్థాన్ గురించిన పాఠం జ్ఞాపకం వచ్చింది. అక్కడ వేడి అంత అపరమితమనీ, వర్షం చాల తక్కువగా కురుస్తుందనీ, అది అంతా రాతి ప్రదేశమనీ, అన్నీ ఒక్కసారే జ్ఞాపకం వచ్చేశాయి.

ఇంకేం - ?గుంటూరు కూడా బెలూచిస్థాన్‌లోని దని నిర్ధారణ చేసేశాను. ధీమాగా 'సమాధానం చేప్తాన'ని మేష్టారుతో అన్నాను.

'సరే, చెప్పు' అన్నారు మేష్టారు.

సదురు బెదురు లేకుండా "గుంటూరు బెలూచిస్థాన్‌లోని దవడం చేత అక్కడ వేడి అపరమితము"వి చెప్పేసేసరికి ఎందుకో మా మేష్టారు కూచున్న పళంగా నుంచొన్నారు. క్లాసులో పిల్లలందరు ఒక్కసారి నవ్వడం మొదలు పెట్టారు.

మా మేష్టారు నుంచున్న పళంగా రెండంగల్లో నాదగ్గరికి వచ్చేశారు. "అవున్రా... వెధవా...! గుంటూరు బెలూచిస్థాన్‌లో ఉందికదూ...? నే చెప్పలేదూ? లేకపోతే నీకు చదువెందుకురా...!?" అంటూ నా వీపుమీద రెండు వడ్డించి వెళ్ళిపోయి, కుర్చీకి సరిపడా కూర్చొన్నారు.

ఆవాళ ఏలాగయితే నేం- స్కూలు ముగిసింది. ఇంటి కొస్తున్నా.

అంతట్లోకే మా అమ్మ గుమ్మంలో నుంచోని "ఏరా ఏడుస్తూ వస్తున్నావ్? మేష్టారు కొట్టారా...? ఆఁ...!అయిందీ...! అన్నంతపనీ జరిగిందీ...? నే చెప్పలేదూ...! ప్రొద్దున్నే లేచి చదువుకోరా అని బతిమాలినా వింటేగా?" అంటూ నేనింకా వీధిలో ఉండగానే మొదలెట్టింది.

నేను లోపల కెళ్ళేసరికి "ఏదీ ఎక్కడ కొట్టారు చూపించు!... అవున్లే! నీకు నిజంగా తగలవలసిందేలే-! కాస్త మంచీ చెడ్డా ఉండక్కరలేదూ...? అవున్లే కాని' నీకిచ్చిన 2 రూపాయల కాగితం అక్కడ పడేసి పోయావుకదా... ఏం? డబ్బంటే అంత నిర్లక్షమా?" అంటూ మరో రెండు వీపుమీద తగిలించింది మా అమ్మ.

ఇంతట్లోకే మా నాన్నగారక్కడికి వచ్చి "కొత్త బట్టలు తెచ్చాను. ఇవి తొడుక్కొని ఈ రూపాయి తీసుకొని నీయిష్టం వచ్చినట్టు తగలబెట్టుకో" అంటూ ఓరూపాయి నా మొఖాన గిరాటేశారు.

ప్రొద్దుటి నుంచీ పట్టుకొన్న నా ఏడుపు ఒక్కసారిగా మాయమైపోయింది. ఎగిరి గంతేసి రూపాయి తీసుకొన్నాను. కొత్త బట్టలు తొడుక్కొని వీధిలోకి పరిగెత్తాను.

ఎన్ని దెబ్బలు తిన్నా, ఎంత ఏడ్చినా పుట్టినరోజు పెద్ద పండుగే సుమా అనిపించింది, నామటుక్కు నాకు! ✶